క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూలపెద్దమ్మ ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్, పర్యవేక్షణాధికారి నాగప్రసాద్ పర్యవేక్షించారు. మూలపెద్దమ్మ జాతర సందర్భంగా నెలరోజుల పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకుని హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.6,08,751 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ధర్మకర్తలు, వాల్మీకి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు తలముడిపి వైద్యాధికారి చిన్నమద్దిలేటి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్కే తాండ, వైకే తాండ గ్రామాలలో మంచానికే పరిమితమైన రోగులకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఎంపీహెచ్ఎస్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ రవళి, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ శ్యామల

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మండల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల సూచించారు. బుధవారం ఎంపీడీఓ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు మండల అధికారులు కృషి చేయాలని, సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పల్లెల్లో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. ప్రజలతో సమన్వయం చేసుకుని సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి, నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం


చనుగొండ్లలో లబ్ధిదారు ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీపీ సునీత

గూడూరు రూరల్: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం అని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. చనుగొండ్లలో బుధవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకటేశ్వరమ్మతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్ ద్వారా ప్రతి నెలా వివిధ పథకాల ద్వారా మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా సొమ్మును ప్రభుత్వం జమ చేస్తోందని వివరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ జగనన్న స్టిక్కర్లను ఇంటి గోడలు, తలుపులకు అతికించారు. ఈ కో ఆప్షన్ సభ్యుడు దౌల, కన్వీనర్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రంగయ్య, మాధవస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరించిన వాన

- కల్లాల్లో తడిసిన ధాన్యం
- రైతన్నల ఆవేదన
- భారీ వర్షానికి పొంగిన వక్కెర వాగు
- మూడు గంటల పాటు నిలిచిన వాహనాల రాకపోకలు


నెరవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కెర వాగు

గూడూరు రూరల్: మండలంలో మంగళవారం అర్ధరాత్రి అకాలవర్షం కుమ్మరించింది. భారీ వర్షానికి పెంచికలపాడు వద్ద వక్కెర వాగు పొంగి పొర్లింది. వర్షపు నీరు ఉధృతంగా బ్రిడ్జిపై నుంచి పారడంతో దాదాపు మూడు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గూడూరు వైపు, కర్నూలు వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తరచూ కురుస్తున్న భారీ వర్షాలకు వాగు పొంగి పొర్లుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, ప్రభుత్వం స్పందించి వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సి.బెళగల్‌లో 34.8 మి.మీ వర్షపాతం

సి.బెళగల్: మండలంలో మంగళవారం అర్ధరాత్రి అనంతరం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మొదలై భారీ వర్షం కురిసింది. బుధవారం వేకువజామున 3:25 గంటలకు చిన్న చినుకులతో మొదలైన వాన తర్వాత ఉధృతమై ఉదయం 5 గంటల వరకు కురిసింది. మండలవ్యాప్తంగా 34.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. మండు వేసవిలో అకాలవర్షం జనాలకు కాస్త ఊరటనిచ్చింది. భారీ వర్షానికి కంబదహాల్, తిమ్మందొడ్డి, పోలకల్ తదితర గ్రామాల వాగులు, వంకలు నిండుగా ప్రవహించాయి. అయితే నూర్పిడి కళ్లాలో ఉన్న ఎండుమిర్చి, మొక్కజొన్న దిగుబడులు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా వర్షం కురవడంతో ఎక్కువ మంది రైతుల ధాన్యం తడిసిపోయిందని బాధితులు వాపోయారు.

రైతన్నను దెబ్బతీసిన అకాల వర్షం

పాణ్యం: మండలంలో కురిసిన అకాల వర్షానికి రైతులు నష్టపోయారు. భారీ వర్షానికి కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో 8 గంటల వరకు కురిసింది. ఆయా గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలో 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఆర్‌జీఎం కళాశాల వద్ద రోడ్డుపై రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం వర్షానికి తడిసిపోయింది. అలాగే కొణిదేడులో వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు వర్షం తగ్గిన తర్వాత ఆరబెట్టుకునే పనిలో పడ్డారు. పాణ్యంలోని జుర్రాగు, కౌలురు లోని కానుగల వాగు, తమ్మరాజుపల్లెలోని తద్దెలదీరి కొండపై జలపాతం ఏర్పడింది. గ్రామంలోని అడ్డవాగుకు నీటి ప్రవాహం పెరిగింది. కందికాయపల్లెలోని నీటికుంటలో వర్షపు నీరు చేరడంతో రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

కల్లూరులో 70 మి.మీ వర్షపాతం

కల్లూరు: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తుతుండగా బుధవారం తెల్లవారుజామున దంచికొట్టిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. మండలవ్యాప్తంగా బుధవారం 70.04 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ఆయా గ్రామాల్లో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. నెరవాడ బ్రిడ్జిపై వక్కెర వాగు ఉధృతంగా ప్రవహించింది. పర్ల గ్రామ సమీపంలోని పర్ల పెద్ద వంక, బొల్లవరం గ్రామం వంక పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు రోడ్డుకు అవతలివైపు కొన్ని గంటల పాటు నిలిచిపోయారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో హంద్రీ నదికి నీరు చేరింది. చిన్నటేకూరు గ్రామంలో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న దిగుబడులు వర్షానికి తడిసిపోయాయి.


కొణిదేడు గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు


మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

కోడుమూరులో 27.4 మి.మీ వర్షపాతం

కోడుమూరు రూరల్: మండలంలో బుధవారం తెలవారుజామున సుమారు గంటకుపైగా గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. 27.4 మి.మీ వర్షం కురవడంతో మండలంలోని ఒట్టిపోయిన వంకలు, వాగుల్లోకి వర్షపునీరు చేరి మండు వేసవిలో జలకళను సంతరించుకోగా వాతవరణం కొంతమేర చల్లబడింది. భారీ గాలివానతో కూడిన వర్షం వల్ల అమడగుంట్ల స్కూల్ వరండాలోని రేకులషెడ్డు పూర్తిగా ధ్వంసమై రేకులన్నీ మైదానంలో చెల్లాచెదురుగా పడిపోయాయి.

గూడూరులో 48.8 మి.మీ వర్షం

గూడూరు: పట్టణంలో భారీ వాన పడింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పట్టణంలో 48.8 మి.మీ వర్ష పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

కోడుమూరు రూరల్: అధికారులంతా ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నియోజకవర్గ స్పెషలాఫీసర్, డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. ఆయన బుధవారం ప్యాలకుర్తి గ్రామంలో పర్యటించి గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు,ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం తనిఖీ, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సిబ్బంది, లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో సర్వీసుల సంఖ్య పెంచాలని, ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి నాడు-నేడు పనులను, హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచికరంగా భోజనం తయారుచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి రోజువారీ కార్యక్రమాలపై దృష్టి సారించాలని, స్పందన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ అనంతయ్య, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు తదితరులున్నారు.

టీడీపీ అసత్య ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓర్వకల్లు: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ధ్వజమెత్తారు. ఇటీవల యువగళం యాత్రలో టీడీపీ నాయకుడు నారా లోకేష్, గుట్టపాడు సర్పంచ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాటసానిపై సత్యదూరపు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు మాట్లాడుతూ.. మండలంలో పారిశ్రామిక హబ్ ప్రభుత్వం కేటాయించింది 12 వేల ఎకరాలు మాత్రమేనని టీడీపీ నాయకులు 30వేల ఎకరాలుగా చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జైరాజ్ స్టీల్ ప్లాంట్‌లో ఓపెన్ బ్లాస్టింగ్ కారణంగా గుట్టపాడులో మిద్దెలు బీటలు వారుతున్నాయని, ఇదెక్కడి న్యాయమని అడిగితే ఎమ్మెల్యే బెదిరింపులకు దిగుతున్నట్లు ప్రచారం చేయడం శోచనీయమన్నారు. రాజకీయాల్లో ఉనికి కోసమే టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీపీ తిప్పన్న, జీకే వెంగన్న, లోటర్ బాషా, చంద్రశేఖర్ రెడ్డి, నాగతిరుపాలు, శంకర్‌రెడ్డి, హరినాథ్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కోడుమూరు: పులకుర్తిలో గ్రామంలో సాయినాథుడి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం గ్రామ పెద్ద, నిర్వాహకులు పి.శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామ పెద్దలు శ్రీనాథ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, సూర్యనారాయణ, రాముడు సాయినాథుడికి పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన 17 జతల వృషభ రాజములు పోటీ పడగా, గూడూరు మండలం మునగాలకు చెందిన మహాదేవమ్మ, అంజనమ్మ వృషభాలు రాతి దూాన్ని నిర్ణీత సమయంలో 3,854 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. అలాగే క్రిష్ణాపురం శ్రీనివాసరెడ్డి, పెద్దనేలటూరు సీతారాముడు వృషభాలు 3,634 అడుగులు,నంద్యాల జిల్లా రామచంద్రారెడ్డి వృషభాలు 3,529 అడుగులు, నంద్యాల జిల్లా తుమ్మలూరు పల్లవి వృషభాలు 3,517 అడుగులు, గద్వాల జిల్లా ఐజ పెద్దయ్యకు చెందిన వృషభాలు 3,321 అడుగుల దూరం లాగి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులను దాతల సహకారంతో శ్రీనాథ్‌రెడ్డి అందజేశారు.

వైఎస్సార్‌సీపీతోనే సమగ్రాభివృద్ధి


ఎర్రదొడ్డిలో మంచినీటి పైపులైన్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రదొడ్డి నుంచి చిల్లబండ గ్రామం వరకు రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైపులైన్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, సీనియర్ నేత అమడగుంట్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. గోరంట్ల వద్ద హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణం, వర్కూరు తుమ్మలవాగుపై వంతెన నిర్మాణం , కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి, రూ.12 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, గ్రామాలను కలుపుతూ రోడ్ల నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత పాలకులు చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. నారా లోకేష్ పాదయాత్ర మొత్తం ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా ప్రభుత్వంపై విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ సాగుతోందన్నా రు. దళితులను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన నారా లోకేష్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశా రు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, స్థానిక నాయకులు మస్తాన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మక్బుల్, ఇలియాస్, శ్రీనివాసులు, గిడ్డయ్య, మద్దిలేటి, గోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కర్నూలు (న్యూటౌన్): సామాన్య ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ వారిని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ సత్యంరెడ్డి, సర్పంచ్ మాధవి, తిరుపతిరెడ్డి, సంపత్‌కుమార్, ప్రసాద్, రవిరెడ్డి, గ్రామ మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అమ్మా, తల్లి, అక్కా, చెల్లి, అవ్వా, తాతా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మంచినీటి పైప్‌లైన్ వేయించి కొళాయిలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరగా వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ విద్యాసాగర్, వాసు, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులను ఆదుకోండి



బూజునూరు సర్పంచ్‌కు ట్రాక్టర్ నమూనా తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు, బిలకలగూడూరు గ్రామాల పరిధిలో స్థాపించిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సంస్థ ప్రతినిధులకు సూచించారు. ఫ్యాక్టరీ దత్తత గ్రామాలకు బుధవారం బిలకలగూడూరు సమీపంలోని బాలాజీ టెంపుల్ వద్ద ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమలు వస్తే ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. జిందాల్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. మండలంలోని గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు ఫ్యాక్టరీ నుంచి ఉచితంగా సిమెంట్ అందించాలని కోరారు. బూజునూరులో పశువులకు మేపుకునేందుకు ఎస్ఆర్‌బీసీ కాల్వపై బ్రిడ్జిని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలకు 25 సెంట్ల స్థలం కావాలని సర్పంచ్ యేలంపల్లె రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివరామిరెడ్డి ఎమ్మెల్యేను కోరగా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. గడివేములలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని బైపాస్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ట్రాక్టర్లను అందజేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త వేసేందుకు డస్ట్‌బిన్‌లను అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, శిరుప శ్రీనివాసరెడ్డి, పోగుల చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 27వ వార్డు 69వ సచివాలయం పరిధిలోని అబ్బాస్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రభుత్వం నుంచి వారు పొందిన పథకాలను వివరించారు. అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మించాలని కోరగా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ పల్లె శారద, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పుల్లారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్తా


సుచరిత (947), బైపీసీ


స్నేహలత (940), బైపీసీ


కృష్ణవేణి (934), ఎంపీసీ


కార్తికేయ (948) ఎంపీసీ


మనోహర్ (955), బైపీసీ

పాణ్యం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం సాయంత్రం ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మండలం నుంచి పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో రేణుక 401 మార్కులతో టాపర్‌గా నిలవగా, రెండో సంవత్సరంలో దేవసాని సుచరిత 947 మార్కులతో సత్తా చాటారు.

- ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 46 మందికి గాను 15 మంది (32.6 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 63 మందికిగాను 46 మంది (73 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. బైపీసీ చదువుతున్న స్నేహలత 940 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు.
- ఏపీటీడబ్ల్యుఆర్ జేసీ కళాశాల మొదటి సంవత్సరంలో 121 మందికిగాను 86 మంది (71శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 141మందికి గాను 124 మంది (90 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. విద్యార్థిని పద్మావతి బైపీసీలో 951, లుధియా ఎంపీసీలో 952 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు వెల్లడించారు.
- కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నుంచి మొదటిసారిగా పరీక్షరాసిన 28 మంది విద్యార్థులకు గాను 16 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ లలితకుమారి తెలిపారు.

కూలీ కుమార్తెకు అత్యుత్తమ మార్కులు

సి.బెళగల్: కూలీకి వెళ్లి జీవనం సాగించే మహిళ కుమార్తె ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ మార్కులతో సత్తా చాటింది. సి.బెళగల్ మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో నివాసముంటున్న రామలక్ష్మి (భర్త మరణించాడు) దినసరి వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ కుమార్తె కృష్ణవేణిని కర్నూలులో ఇంటర్మీడియెట్ చదివిస్తోంది. కృష్ణవేణి ఎంపీసీలో 934 మార్కులు సాధించి తల్లి కష్టానికి తగ్గ ప్రతిఫలం అందించి శభాష్ అనిపించుకుంది.

- స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 31 మంది పరీక్షలు రాయగా 29 మంది, బైపీసీలో 35 మంది పరీక్షలు రాయగా 19 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 72గా నమోదైంది. ఎంపీసీ విభాగంలో కార్తికేయ 948, ఇసాక్‌రాజు 945, క్రాంతికుమార్ 924, బైపీసీలో మనోహర్ 955 మార్కులతో టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 37 మందికిగాను 34, బైపీసీలో 38 మందికిగాను 19 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 71గా నమోదైంది. ఎంపీసీ విభాగంలో రంగస్వామి 449, మహేంద్ర 432, కాంతరావు 430 మార్కులు సాధించగా, బైపీసీలో శివరాజు 414 మార్కులతో టాపర్లుగా నిలిచారు.


ఆర్.కిరణ్‌కుమార్ (978) ఎంపీసీ


పి.సందీప్ (960), ఎంపీసీ


పి.మనోజ్‌కుమార్ (984), బైపీసీ


ఎమ్‌డి.రషీద్ (980), బైపీసీ


ఎస్.అధరణకుమార్ (464), ఎంపీసీ


కె.రాఘుసాయి (459), ఎంపీసీ


అజయ్‌కుమార్ (421), బైపీసీ


పవన్‌కళ్యాన్ (420), బైపీసీ

గురుకులంలో వంద శాతం ఉత్తీర్ణత

కల్లూరు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల) ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 87 మంది, ద్వితీయ సంవత్సరంలో 120 మంది మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో ఆర్.కిరణ్ కుమార్-978, పి. సందీప్ -960, బైపీసీలో పి.మనోజ్‌కుమార్ -984, కేఎండీ.రషీద్-980 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అధరణకుమార్-464, కె.రాఘుసాయి-459, బైపీసీలో పి.వెంకట అజయ్‌కుమార్-421, పవన్ కల్యాన్-420 మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు

- పెద్దపాడు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరంలో 51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 72 శాతం మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఈరన్న తెలిపారు.
- లక్ష్మీపురంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మొదటి సంవత్సరంలో 75 శాతం, ద్వితీయ సంవత్సరంలో 80 శాతం మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. మొదటి సంవత్సర సీఏసీఈలో కె.పల్లవి 473 మార్కులు, ద్వితీయ సంవత్సరం సీఏసీఈ గ్రూపులో ఎస్.సుల్తానా 958 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.